# శతక మధురిమ

**చదవండి - ఆలోచించి చెప్పండి.**

రాజేశ్ : రవీ! బాగున్నావా!
రవి : బాగున్నాను రాజేశ్. నువ్వేం చేస్తున్నావు? మన చిన్ననాటి మిత్రులు ఎవరైనా కలుస్తున్నారా?
రాజేశ్ : ఆ!ఆ! అందరూ కలుస్తున్నారు. సంతోష్ లాయరైనాడు. భాను టీచరైనాడు. మధు వ్యాపారం చేస్తున్నాడు. సుభాష్ రాజకీయనేతగా ఎదగాడు. ఇలా అందరూ ఒక్కోరంగంలో నీతి నిజాయితీలతో రాణిస్తున్నారు.
రవి : చిన్నప్పుడు మనం చదివిన చదువు, పొందిన జ్ఞానం ఊరికేపోతుందా? ఆ చదువుల ఫలితం, గురువుల దీవెనలు అన్నీ కలిస్తేనే మన అభివృద్ధి.
రాజేశ్ : ఔనౌను! ముఖ్యంగా శతక పద్యాల్లోని నీతులు మనవ్యక్తిత్వానికి బాటలు వేశాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపాయి కదూ!
రవి : బాగా చెప్పావు రాజేశ్! శతక పద్యాలు నేటికీ మార్గదర్శకాలు మీ పిల్లలకు కూడా నేర్పించు బాగా!
రాజేశ్ : నేర్పుతున్నాను. సరే రవీ! బస్సు వచ్చింది. మళ్ళీ కలుద్దాం.

## ప్రశ్నలు

1. సంభాషణను బట్టి వారు ఎవరని భావిస్తున్నారు?
2. వారి అభివృద్ధికి కారణాలేవి?
3. వ్యక్తిత్వాన్ని ఏవి తీర్చిదిద్దుతాయి?
4. ఏవి నేటి తరానికి మార్గదర్శకాలని రవి చెప్పాడు?

## పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం

శతకాలు నైతిక విలువలను పెంపొందింపజేస్తాయి. భావి జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. శతక పద్యాల్లోని నైతిక విలువలను తెల్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## పాఠ్యభాగ వివరాలు

శతకపద్యాలలో మకుటం ప్రధానమైంది. ఈ పద్యాల్లో ప్రతి పద్యం చివర మకుటం ఉంటుంది. ఇవి ముక్తకాలు, అంటే ఏ పద్యానికదే స్వతంత్ర భావంతో ఉంటుంది. ప్రస్తుత పాఠంలోని పద్యాలు మల్లభూపాలీయం, చిత్త శతకం, తరిగొండ నృసింహ శతకం, భక్త చింతామణి శతకం, ఉత్పలమాల, విశ్వనాథేశ్వర శతకం, నింబగిరి నరసింహ శతకం, లొంకరామేశ్వర శతకం అనే శతకాలలోవి.

## ప్రవేశిక

1. విశిష్టమైన సాహిత్య ప్రక్రియల్లో పద్యం ఒకటి. పద్యం ఛందోబద్ధమైంది. లయాత్మకంగా గానయోగ్యంగా ఉంటుంది. ధారణకు అనువుగా ఉంటుంది. అందుకే మన ప్రాచీన కవులు స్తుతులు, శాస్త్రవిషయాలు, నైతిక విషయాల్ని పద్యాల్లో చొప్పించి అందించారు. పద్య ప్రక్రియలో 'శతకం' ఒక విభాగం. మేలిముత్యాల్లాంటి శతక పద్యాలనుండి కొన్నింటిని ఈ పాఠం ద్వారా తెలుసుకుందా! పద్య రసానుభూతిని ఆస్వాదిస్తూ నైతిక విలువల్ని పెంపొందించుకుందాం....

## I

మ॥ సిరిలేకైన విభూషితుండె యయి భాసిల్లున్ బుధుండౌదలన్
గురుపాదానతి కేలనీగి చెవులందు న్విన్కి వక్త్రంబునన్
స్థిరసత్యోక్తి భుజంబులన్విజయమున్జిత్తం బునన్నమ్మనో
హర సౌజన్యము గల్గిన న్సురభిమల్లా! నీతి వాచస్పతీ!

– ఎలకూచి బాల సరస్వతి

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| నీతి వాచస్పతీ | = | నీతి విషయంలో బృహస్పతీ! |
| సురభిమల్లా | = | ఓ సురభి మల్లా ! |
| ఔదలన్ | = | తలపైన |
| గురుపాదానతి | = | గురువు యొక్క పాదాలకు పెట్టే నమస్కారం |
| కేలను + ఏని | = | చేతులకైతే |
| ఈగి | = | త్యాగము |
| చెవులు + అందు | = | చెవులకు మాత్రం |
| విన్కి | = | వినికిడి |
| వక్త్రంబునన్ | = | నోటికి |
| స్థిర | = | శాశ్వతమైన |
| సత్య + ఉక్తి | = | నిజమైన మాట |
| భుజంబులన్ | = | బాహువులకు |

విజయమున్ = విజయం
చిత్తంబునన్ = మనస్సుకు
మనోహర = అందమైన
సౌజన్యమున్ = మంచితనం
కల్గినన్ = ఉన్నట్లయితే
బుధుండు = పండితుడు
సిరిలేక + ఐన = సంపద లేకపోయినా
విభూషితుండె = అలంకరింపబడినవాడె
అయి = అవుతూ
భాసిల్లున్ = ప్రకాశిస్తాడు

తాత్పర్యం : నీతిలో బృహస్పతి వంటివాడా! సురభిమల్లా! తలకు, గురుపాదాలకు పెట్టే నమస్కారం, చేతులకు త్యాగం, చెవులకు మంచి వినే గుణం ఉండాలి. నోటికి సత్యవాక్కు ఉండాలి. బాహువులకు విజయం, మనసుకు మంచితనం ఉండాలి. అలాంటి పండితుడు సంపదలేకపోయినా ప్రకాశిస్తాడు.

ఉ॥ బీదలకున్న వస్త్రములు పేర్మినొసంగుము తుచ్ఛ సౌఖ్యసం
పాదనకై యబద్ధముల బల్కకు, వాదములాడబోకు, మ
ర్యాదనతిక్రమింపకు, పరస్పరమైత్రి మెలంగు, మిట్టివౌ
వేదములంచెరుంగుము, వివేకధనంబిదినమ్ముచిత్తమా!

– శ్రీపతి భాస్కర కవి

ప్రతిపదార్థం :
చిత్తమా! = ఓ మనసా !
బీదలకు = పేదవారికి
అన్నవస్త్రములు = భోజనము, బట్టలు
పేర్మిని = గౌరవంతో
ఒసంగుము = ఇమ్ము
తుచ్ఛ = నీచమైన
సౌఖ్య సంపాదనకు + ఐ = సౌఖ్యాన్ని సంపాదించడానికి
అబద్ధములన్ = అసత్యాలను
పల్కకు = మాట్లాడవద్దు
వాదములు = తగవులు
ఆడవద్దు = పెట్టుకోవద్దు
మర్యాదను = గౌరవాన్ని (హద్దును)
అతిక్రమింపకు = మీరవద్దు
పరస్పర = ఒకరితో ఒకరు
మైత్రి = స్నేహంతో
మెలంగుము = ప్రవర్తించుము
ఇట్టి = ఇటువంటివే
వేదములు = జీవన వేదములు
అంచు = అనుచూ
ఎరుంగుము = తెలుసుకో!
ఇది = ఇదే
వివేక ధనము = వివేకమనే సంపద

తాత్పర్యం : ఓ మనసా! బీదవారికి అన్నదానం, వస్త్రదానం చేయాలి. నీచమైన సౌఖ్యాల కోసం అబద్ధాలు చెప్పకు. తగవులు పెట్టుకోకు. మర్యాదను మీరకు. ఒకరితో ఒకరు స్నేహంగా ఉండాలి. ఇటువంటివే జీవన వేదాలని తెలుసుకో. వివేకమనే ధనం ఇదే కదా!

## II

ఉ॥ పట్టుగ నీశ్వరుండు తన పాలిట నుండి పుడిచ్చినంతోఁ
దిట్టక దీనదేహులను తేటగ లాలనజేసి, యన్నమున్
పెట్టు వివేకి మానసముఁ బెంపొనరించుచు నూరకుండినన్
గుట్టుగ లక్ష్మిఁబొందుఁ; దరిగొండనృసింహ! దయాపయోనిధీ!

– తరిగొండ వెంగమాంబ

ప్రతిపదార్థం :

దయాపయోనిధీ = దయా సముద్రుడా!
తరిగొండ నృసింహ = తరిగొండలో వెలసిన నరసింహస్వామీ!
ఈశ్వరుండు = భగవంతుడు
పట్టుగన్ = పట్టుదలతో
తన పాలిటను + ఉండి = తన పక్షమున ఉండి
ఇపుడు + ఇచ్చిన + అంతలోన్ = ఇప్పుడు తనకు ప్రసాదించిన దానికి తగినట్లు
దీనదేహులను = దీనులైన వారిని
తిట్టక = నిందించకుండా
తేటగ = నిర్మలంగా
లాలన + చేసి = ఆదరించి
అన్నమున్ = ఆహారమును (భోజనమును)
పెట్టు = పెట్టునటువంటి
వివేకి = తెలివైనవాడు
ఊరక + ఉండినన్ = ఎటువంటి ప్రార్థనలు (పనులు) చేయకపోయినా
మానసమున్ = మనస్సును
పెంపు + ఒనరించుచున్ = అభివృద్ధి చేయుచూ
గుట్టుగ = రహస్యంగా
లక్ష్మిన్ = సంపదను
పొందున్ = పొందును

తాత్పర్యం : దయా సముద్రుడా! తరిగొండ నరసింహస్వామీ! ఈశ్వరుడు పట్టుదలతో తన పక్షం వహించి ప్రసాదించిన సంపదలో శక్తిమేరకు పేదవారికి పెట్టాలి. అలాగే పేదలను నిందించకుండా అన్నం పెట్టిన వానికి మనస్సుకు ఆనందం కలుగుతుంది. ప్రయత్నించకపోయినా సంపద చేరుతుంది.

మ॥ తనదేశంబు స్వభాష నైజమతమున్ అస్మత్సదాచారముల్
తనదేహాత్మల నెత్తెఱంగున సదాతానట్లు ప్రేమించి, త
ద్ఘనతా వాప్తికి సాధనంబులగు సత్కార్యమ్ములన్ జేయఁగా
అనువౌబుద్ధి యొసంగుమీ ప్రజకు దేవా! భక్త చింతామణీ!

– వడ్డాది సుబ్బరాయకవి

ప్రతిపదార్థం :

దేవా = ఓ దైవమా!
భక్త చింతామణీ = భక్తులకు చింతామణీ రత్నంవలె కోరిన కోరికలను ఇచ్చే వాడా!
తన దేహాత్మలన్ (తన దేహ + ఆత్మలన్)
తన దేహ = తన శరీరాన్ని
ఆత్మలన్ = ఆత్మలను
ఎత్తెఱంగునన్ (ఏ + తెఱంగునన్) = ఏ విధంగా మనిషి ప్రేమిస్తాడో, ఆ విధంగా
తన దేశంబున్ = తన దేశాన్ని
స్వభాషన్ = తన భాషను
నైజమతమున్ = తన మతమును
అస్మత్ సదాచారముల్
అస్మత్ = తన యొక్క
సదాచారముల్
(సత్ + ఆచారముల్ = మంచి ఆచారాలను
సదా = ఎల్లప్పుడునూ
తాను = తాను
అట్లు = ఆ విధంగా
ప్రేమించి = ప్రేమతో చూసి
తద్ఘనతా వాప్తికిన్ (తత్ + ఘనతా + అవాప్తికిన్)
తత్ = ఆ దేశము, భాష, మతము సదాచారములు అనేవి
ఘనతా = గొప్పతనమును
అవాప్తికిన్ = పొందుటకు
సాధనంబులగు = సాధనములైన


www.sakshieducation.com

సత్కార్యములన్ = మంచి పనులను
చేయగాన్ = చేయడానికి
అనువౌ (అనువు + ఔ) = తగిన
బుద్ధి = బుద్ధిని
ప్రజకున్ = ప్రజలకు
ఒసంగుమీ = ఇమ్ము

తాత్పర్యం : భక్తుల పాలిట చింతామణి రత్నం వంటి వాడవైన ఓ స్వామీ! ఎవరైనా తన శరీరాన్ని, ఆత్మనూ, ఎట్లా అభిమానిస్తారో, ఆ విధంగానే తన దేశాన్ని, తన భాషను, తన మతాన్ని, తన మంచి ఆచారాలను కూడా అభిమానించేటట్లూ, వాటి ఔన్నత్యానికి సాధనాలయిన మంచి పనులను చేసేటట్లూ, తగిన బుద్ధిని ప్రజలకు ప్రసాదించు.

## III

చ॥ అనయము దోషమే పరులయందు కనుంగొని పల్కునట్టి యా
జనుని కొగిన్ గుణగ్రహణశక్తి నశించును; మంచి మాత్రమే
జనములలోన చూడగల చక్కని చూపులు పల్కునాల్క నా
కెనయగనిమ్ము వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియఃపతీ!

– ఉత్పల సత్యనారాయణాచార్య

ప్రతిపదార్థం :

వేంకటపతీ = 'వేంకట' అను పర్వతమును పరిపాలించు వాడా!
అఖిలాండపతీ (అఖిల + అండ పతీ) = బ్రహ్మాండానికి అధిపతియైన వాడా!
శ్రియఃపతీ = లక్ష్మీదేవి భర్తవైన వేంకటేశ్వరస్వామీ!
పరుల + అందు = ఇతరులలో
అనయము = ఎల్లప్పుడు
దోషము + ఏ = తప్పును మాత్రమే
కనున్ + కొని = కనిపెట్టి
పల్కును + అట్టి = మాట్లాడేటటువంటి
ఆ జనునికి = ఆ మానవునకు
ఒగిన్ = క్రమంగా
గుణగ్రహణశక్తి = మంచి గుణాలను గ్రమించగల సామర్థ్యం
నశించును = నాశనమైపోతుంది
జనములలోన = మానవులలో
మంచి మాత్రమే = మంచితనమును మాత్రమే
చూడన్ + కల = కనిపెట్టగల
చక్కని చూపులు = చక్కనైన కన్నులు
పల్కునాల్క = మాట్లాడే నాలుక
నాకు = నాకు (కవికి, భక్తునికి)
ఎనయగన్ = సరిపోయే విధంగా
ఇమ్ము = ప్రసాదించుము

తాత్పర్యం : సమస్త బ్రహ్మాండానికి అధిపతీ! లక్ష్మీవల్లభా! ఓ వేంకటేవ్వరా! ఇతరులలో ఎల్లప్పుడూ దోషాలనే వెతికి, వాటి గురించి మాత్రమే మాట్లాడేవానికి, మంచిని గ్రహించే సామర్థ్యం క్రమంగా నశిస్తుంది. మానవులలో మంచిని మాత్రమే చూడగల కళ్లూ, మంచిని పలికే నాలుకా నాకు ప్రసాదించు.

మ॥ ఇతిహాసామృత రుక్ప్రభా ధవళితంబీ భారతం బార్షసం
స్మృతి జీవత్సరిదంబు సేవితము; సాహిత్యస్వరానంద దీ
పితమున్ పావన భావనావహమహావేశంబె జాతీయతా
వ్రతమౌ ధర్మపరాయణర్షి పరివారా! విశ్వనాథేశ్వరా!

– గుమ్మన్నగారి లక్ష్మీనరసింహాశర్మ

ప్రతిపదార్థం :

ధర్మపరాయణర్షి పరివారా!
ధర్మ = ధర్మము నందు
పరాయణ = మిక్కిలి ఆసక్తి కల (ప్రియమైన)
ఋషి = ఋషుల చేత
పరివారా = చుట్టుకొనబడిన వాడా!

www.sakshieducation.com

| | | |
|---|---|---|
| విశ్వనాథేశ్వరా | = | విశ్వనాథేశ్వరుడా! |
| ఈ భారతంబు | = | ఈ భారతదేశము |
| ఇతిహాసామృత ఋగ్రప్రభా ధవళితంబు | | |
| ఇతిహాస | = | ఇతిహాసములనే |
| అమృత | = | అమృతముతోనూ |
| 'ఋక్ ప్రభా; ఋక్ | = | ఛందో బద్ధమైన వేదమంత్రముల యొక్క |
| ప్రభా | = | శోభతోనూ |
| దవళితంబు | = | తెల్లనిదిగా చేయబడినది (పవిత్రమైనది) |
| ఆర్ష సంస్కృతి జీవత్సరిదంబు సేవితము | | |
| ఆర్ష | = | ఋషుల సంబంధమైన |
| సంస్కృతి | = | సంస్కృతి అనే |
| జీవత్సరిత్ | = | జీవనది యొక్క |
| అంబు | = | నీటిచే |
| సేవితము | = | సేవింపబడినది (ఆర్షసంస్కృతీ జీవనదీ జలం ప్రవహించేది) |
| సాహిత్య స్వరానంద దీపితమున్; | | |
| సాహిత్య | = | సాహిత్యము యొక్క |
| స్వరానంద (స్వర + ఆనంద) | = | సంగీత స్వరము యొక్క ఆనందముచే |
| దీపితమున్ | = | ప్రకాశింపజేయబడినది |
| పావన భావనావహ మహావేశంబె; | | |
| పావన | = | పవిత్రమైన |
| భావనా | = | ఆలోచనలను |
| ఆవహ | = | కలిగించే |
| మహావేశంబె (మహా + ఆవేశంబు + ఎ) | | |
| మహా | = | గొప్పదైన |
| ఆవేశంబు + ఎ | = | అభినివేశమే |
| జాతీయతా వ్రతమౌ; | | |
| జాతీయతా వ్రతము | = | జాతీయతా వ్రతముగా |
| ఔన్ | = | అవుతుంది |

తాత్పర్యం : ధర్మ పరాయణులైన మహర్షులు పరివారంగా కలిగిన వాడా! ఓ విశ్వనాథేశ్వరా! భారతదేశం, ఇతిహాసాలు అనే అమృతంతో, వేదమంత్రాల శోభతో ప్రకాశిస్తోంది. ఆర్ష సంస్కృతి అనే జీవనది జలంతో, సేవింపబడుతోంది. సాహిత్య సంగీత స్వరానందముతో శోభిల్లుతోంది. పవిత్రమైన ఆలోచనలను తీవ్రంగా ఆవాహన చేసుకోవడమే. భారతదేశానికి జాతీయతా వ్రతం.

## IV

సీ॥ గుణమింత కుదురక గుళ్ళు తిరుగుటయేల?
    సంస్కారమబ్బని చదువులేల?
చిత్తంబు నిలువని శివపూజలవియేల?
    శాంతిగూర్చని యోగసాధనేల?
మంచిని పెంచని మలినమతము లేల?
    హితబుద్ధి గలుగని వ్రతములేల?
అభ్యుదయము గాని ఆచారతతియేల?
    తగురక్ష సేయని ధర్మమేల?

తే॥ దమము శమము కూడని జపతపము లేల?
స్వామి! నీభక్తి కలుగని జన్మమేల?
వరశుభ విలాస! శ్రీనింబగిరి నివాస!
భవ్యగుణధామ! నరసింహ! దివ్యనామ!!

– అందె వేంకటరాజం

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| శ్రీనింబగిరి నివాస | = | నింబగిరిలో వెలసినవాడా! |
| వరశుభవిలాస! | = | శ్రేష్ఠమైన శుభములు ఇచ్చువాడా! |
| భవ్యగుణధామ | = | అత్యుత్తమ గుణాలకు నిలయమా! |
| దివ్యనామ! | = | దివ్యమైన పేరు గలవాడా! |
| నరసింహ! | = | ఓ నరసింహ దైవమా! |
| ఇంత | = | కొంచెము కూడా |

| | | |
|---|---|---|
| గుణము | = | మంచి లక్షణము |
| కుదురక | = | ఏర్పడకుండా |
| గుళ్ళు | = | దేవాలయాలు |
| తిరుగుట | = | పదే పదే వెళ్ళుట (ప్రదక్షిణములు చేయుట) |
| ఏల | = | ఎందుకు? (వృథా) |
| సంస్కారము | = | ఉత్తమమైన ప్రవర్తన |
| అబ్బని | = | అలవడని |
| చదువులు | = | విద్యలు |
| ఏల | = | ఎందుకు? (వృథా) |
| చిత్తంబు | = | మనసు |
| నిలవని | = | నిలపడని |
| శివపూజలు + అవి | = | ఆ శివపూజలు |
| ఏల | = | ఎందుకు? (వృథా) |
| శాంతిన్ | = | మనశ్శాంతిని |
| కూర్చని | = | కలిగించని |
| యోగసాధన | = | ప్రాణాయామాది యోగ సాధనలు |
| ఏల | = | ఎందుకు? (వృథా) |
| మంచిని పెంచని | = | మంచితనమును వృద్ధి చేయని |
| మలిన | = | మురికియైన |
| మతములు | = | అనేక మతాలు |
| ఏల | = | ఎందుకు (వృథా) |
| హితబుద్ధి | = | మంచి ఆలోచనను |
| కలుగని | = | కలిగింపని |
| వ్రతములు | = | పూజా విధానములు |
| ఏల అభ్యుదయము (అభి + ఉదయము) | = | ప్రగతి, అభివృద్ధి |
| కాని | = | కలిగింపని |
| ఆచారతతి | = | ఆచారాల సమూహం |
| ఏల | = | ఎందుకు? (వృథా) |
| తగు | = | తగిన విధంగా |
| రక్ష + చేయని | = | రక్షింపని |
| ధర్మము | = | మానవ ధర్మము |
| దమము | = | ఇంద్రియ నిగ్రహము |
| శమము | = | కామ క్రోధాదులు లేకుండా ఉండడం (కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం-అంతర్గత శత్రువులు) |
| కూడని | = | కలుగనటువంటి |
| జపతపములు + అవి | = | ఆ జపాలు, తపస్సులు |
| స్వామి! | = | ఓ నరసింహస్వామీ! |
| నీ భక్తి | = | నీ పైన భక్తి |
| కలుగని | = | కలుగనటువంటి |
| జన్మము + ఏల | = | జన్మ ఎందుకు? (వృథా) |

తాత్పర్యం : శ్రేష్ఠమైన శుభములకు నివాసమైనవాడా! నింబగిరి నివాసా! గొప్ప గుణములకు నివాసమైన వాడా! గొప్ప పేరు కలవాడా! ఓ నరసింహ దైవమా! మంచి గుణములు ఏర్పడకుండా దేవాలయ ప్రదక్షిణలు చేయడం వృథా. సంస్కార మేర్పడని చదువుల వలన ప్రయోజనం లేదు. మనసు నిలబడని శివపూజలు అనవసరం. శాంతిని కలిగించని యోగ సాధనలు వ్యర్థం. మంచిని పెంచని మతాలు అనవసరం. మంచిబుద్ధి కలిగించని వ్రతాలు అనవసరం. ప్రగతి కలిగించని ఆచారాలు అనవసరం. రక్షించని ధర్మాలు వృథా. ఇంద్రియ నిగ్రహం, కామక్రోధాదులను అదుపు చేయని జపాల వలన, తపస్సు వలన ప్రయోజనం లేదు. ఓ నరసింహస్వామీ! నీ పైన భక్తిలేని జన్మ వృథా.

శా॥ ఇల్లాలింటికి దీపమౌననగ హీహీయంచు మందుల్ మహా
భల్లూకాకృతి దోప నవ్వుదురు, దీవ్యద్వ్యోమగంగన్ జటా
వల్లిన్ నీవు ధరించుటన్ వినరొ, యెవ్వారైన మర్యాద వ
ర్ధిల్లన్ కాంతల జూడకున్న హితమా? శ్రీలొంక రామేశ్వరా!
– నంబి శ్రీధరరావు

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| శ్రీలొంక రామ + ఈశ్వరా | = | లొంకలో వెలసిన రామేశ్వరా! |
| ఇల్లాలు | = | భార్య |
| ఇంటికి | = | గృహమునకు |
| దీపము + ఔను + అనగ | = | దీపము వంటిది అంటే |
| మందుల్ | = | మందత్వము గలవారు (జడులు) |
| మహాభల్లూక + ఆకృతిన్ | = | పెద్ద ఎలుగుబంటి ఆకారమును |
| తోప | = | తోచు విధముగా |
| హీహీయంచు | = | హీహీ అంటూ వికటంగా (వెకిలిగా) |
| నవ్వుదురు | = | నవ్వుతారు |
| దీవ్యత్ | = | ప్రకాశవంతమైన |
| వ్యోమగంగన్ | = | ఆకాశ గంగను |
| నీవు | = | నీవు (ఈశ్వరుడు) |
| జలావల్లిన్ | = | జడలనెడు తీగెలలో |
| ధరించుటన్ | = | (పువ్వువలె) ధరించుటను |
| వినరొ | = | విని ఉండలేదో! |
| (వినరు + ఒ) | = | (విని ఉండరు) |
| ఎవ్వారైన | | |
| ఏ + వారు + ఐన | = | ఎవరైనా |
| మర్యాద | = | గౌరవం |
| వర్ధిల్లన్ | = | పెరుగుటకు |
| కాంతలన్ | = | స్త్రీలను |
| చూడకున్న | = | గౌరవించకపోవుట |
| హితమా | = | తగినదా? (కాదు) |

తాత్పర్యం : (సిరికొండకు 7 కి.మీ. దూరంలో గల) లొంకలో వెలసిన రామేశ్వరా! ఇల్లాలు ఇంటికి దీపం వంటిది. అంటే ఎలుగుబంటిలా వెకిలిగా నవ్వుతారు. ఆకాశగంగను తన జటలనే తీగెలలో పవిత్రమైన పువ్వుగా ధరించిన శివుని గూర్చి విని ఉండరు. స్త్రీలను గౌరవించడం వలన మన గౌరవం పెరుగుతుంది.

## ఇవి చేయండి

### I. అవగాహన - ప్రతిస్పందన

1. కింది అంశాల గూర్చి మాట్లాడండి.

అ) సంస్కారం

ఆ) వ్రతాలు

ఇ) ఆచారాలు

ఈ) దానగుణం

2. పాఠంలోని పద్యాల ఆధారంగా కింది వాక్యాలకు తగిన పద్యపాదం గుర్తించండి.

అ) ఎల్లప్పుడు ఇతరుల దోషాలను చూడటం.

ఆ) పేదవారికి ఆహారం, బట్టలు దానం చేయడం.

ఇ) సంపద రహస్యంగా వచ్చి చేరుతుంది.

3. కింది పద్యాలను పాదభంగం లేకుండా పూరించండి.

అ) ఇల్లాలింటికి ...............రామేశ్వరా!

ఆ) సిరిలేకైన ................ వాచస్పతీ!

4. కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

సత్యసూక్తి ఘటించు, ధీజడిమ మాన్చు
గౌరవమొసంగు, జనులకుఁగలుషమడచు
కీర్తిప్రకటించు, చిత్త విస్ఫూర్తి జేయు
సాధుసంగంబు సకలార్థ సాధకంబు.

ప్రశ్నలు

అ) సూక్తి అంటే ఏమిటి?

ఆ) కీర్తి ఎలా వస్తుంది?

ఇ) సాధుసంగం వల్ల ఏం జరుగుతుంది?



www.sakshieducation.com

ఈ) ఈ పద్యానికి శీర్షిక సూచించండి.

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

1. కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) వివేకి లక్షణాలేవి?

జ. కూటికి, గుడ్డకు లేని పేదలకు అన్నదానం చేయాలి. వస్త్రదానం చేయాలి. అదికూడా ప్రేమతో చేయాలి. సమృద్ధిగా (ఎక్కువగా) ఇవ్వాలి. ఇది వివేకవంతుని లక్షణం. 'మానవసేవే మాధవసేవ' అన్నారు కదా! అందుచేత పేదలకు దానం చేస్తే భగవంతునికి దానం చేసిన పుణ్యం వస్తుంది.

నీచమైన సుఖాల కోసం అబద్ధాలు పలకకూడదు. తగవు పెట్టుకోకూడదు. స్నేహంగా ఉండాలి. ఇవి కూడా వివేకి లక్షణాలే. స్నేహాన్ని మించిన తృప్తిలేదు. తృప్తిని మించిన సుఖం లేదు కదా!

ఆ) సంపద ఎవరి వద్దకు వచ్చి చేరుతుంది?

జ. దైవం మనపై దయతో సంపదలు ప్రసాదిస్తాడు. కలిగినంతలో పేదలకు పెట్టాలి. నిందించకుండా, ఆదరణతో పెట్టాలి. ఆ విధంగా పెట్టినవారు ఏ ప్రయత్నం చేయకపోయినా సంపద వారిని చేరుతుంది.

దీనిలో విశేషమేమిటంటే విష్ణువుకు (దరిద్ర) నారాయణుడు, (దరిద్ర) దామోదరుడు అని పేర్లు. అంటే దరిద్రులలో నారాయణుడు ఉంటాడు. నారాయణుని భార్య లక్ష్మీదేవి. తన భర్తను ఆదరించిన వారి దగ్గరకే భార్య కూడా వెడుతుంది. కానీ, ఆదరించని వారి దగ్గరకు వెళ్ళదు కదా! అందుచేత పేదలను (నారాయణుని) ఆదరించే వారి దగ్గరకు లక్ష్మి వెడుతుంది. అందుచేత పేదలను (నారాయణుని) ఆదరించే వారి దగ్గరకు లక్ష్మి వెడుతుంది. సంపదలు ప్రసాదిస్తుంది.

ఇ) దేశభాషల ఔన్నత్యాన్ని పెంచడమంటే ఏంటి?

జ. మనం దేశము యొక్క ఔన్నత్యాన్ని అంటే గొప్పతనాన్ని బాగా పెంపొందించాలి. దేశాన్ని సకల సంపదలతో స్వయం సమృద్ధముగా తీర్చిదిద్దాలి. పాడిపంటలు, పరిశ్రమలు పెంపొందించాలి. దేశంలో విద్యా, వైద్య రవాణా సౌకర్యాలు పెంచాలి. యువతకు ఉద్యోగావకాశాలు పెంచాలి. ప్రజలందరికీ ఉపాధి చూపించాలి. ప్రజలకు ఆహారభద్రత కల్పించాలి. ప్రజలకు రక్షణ కల్పించాలి.

బాషల ఔన్నత్యాన్ని పెంచడం అంటే, ఆ భాషలను ప్రజలు బాగా చదవాలి. ఆ భాషలలో మాట్లాడాలి. ఆ భాషలలో పరిశోధనలు సాగించాలి. ఆ భాషలలోని సాహిత్య సంపదను కాపాడి, ప్రజలందరికీ దానిని అందించాలి. ఆ భాషలలో నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు, వగైరా రూపొందించాలి. ఆ భాషలో వివిధ రకములయిన సాహిత్య ప్రక్రియలను ప్రోత్సహించాలి. ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఆ భాషలలో సాగాలి.

ఈ) "ఇతిహాసామృత...." అనే పద్యభావాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

జ. ఓ విశ్వనాథేశ్వరా! భారతదేశం ఇతిహాసాలు అనే అమృతంతో అలరారుతోంది. ఇది వేదమంత్రాల మహిమతో పవిత్రమయ్యింది. భారతదేశంలో ఆర్ష సంస్కృతి అనే జీవనదీ జలాలు ప్రవహిస్తున్నాయి. ఇక్కడ సాహిత్యము అనే సంగీత స్వరాలు వినిపిస్తాయి. పవిత్రమైన ఆలోచనలను కలిగించే గొప్ప ఆవేశమే, 'జాతీయతా వ్రతం' అవుతుంది.

2. కింది ప్రశ్నలకు ఆలోచించి పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

అ) సజ్జన లక్షణాలు పేర్కొనండి.

జ. సజ్జనుడు స్త్రీలను గౌరవిస్తాడు. పరస్త్రీలను తన తల్లిగా భావిస్తాడు. సోదరిగా కాపాడతాడు. స్త్రీలను చిన్న చూపు చూడడం, అవమానించడం సహించడు.

మంచి లక్షణాలు అలవరచుకొంటాడు. చదువుతో బాటు ఉత్తమ సంస్కారవంతుడౌతాడు. గురువులను, తల్లిదండ్రులను, పెద్దలను గౌరవిస్తాడు. శాంతియుతంగా జీవిస్తాడు. తోటివారిని రక్షిస్తాడు. దయ కలిగి ఉంటాడు. దైవభక్తి, దేశభక్తి, స్వామిభక్తి కలిగి ఉంటాడు. ఎవ్వరిపైనా ద్వేషం ఉండదు. ఇతరులలో తప్పులను పట్టించుకోడు. దోషాలుంటే సవరిస్తాడు. అందరిలోనూ మంచిని మాత్రమే చూస్తాడు. సత్యమే పల్కుతాడు.

కుల, మత భేదాలుండవు. తనకు దేవుడు ప్రసాదించిన సంపదను పేదలకు పంచి పెడతాడు. పేదలను, వృద్ధులను ఆదరిస్తాడు. ఎవరినీ నిందించడు. కించపరచడు. సుఖాలను ఆశించడు. కష్టాలకు భయపడడు. ఎవరితోనూ తగవు పెట్టుకోడు. మర్యాదనతిక్రమింపడు. స్నేహంగా ఉంటాడు. శాస్త్ర చర్చలలో పాల్గొంటాడు. యుద్ధానికి జంకడు. అటువంటి ఉత్తమ లక్షణాలు, ప్రవర్తన కలవాడే సజ్జనుడు.

ఆ) నైతిక విలువలంటే ఏమిటి? మీరు గమనించిన విలువల్ని పేర్కొనండి.

జ. నీతిగా జీవించడమే నైతికం. నీతి సంబంధమైన జీవన విలువలనే నైతిక విలువలు అంటారు. సమాజంలో ఒకనాటి నీతి కొన్ని రోజులకు మారిపోతుంది. అప్పటికి అది నీతి కాకపోవచ్చును. కాని, సమాజం అభివృద్ధి గురించి ఏర్పాటు చేసుకొన్న కట్టుబాట్లనే నీతులు అంటారు.

బంధుమిత్రులకు సహాయం చేయడం నీతి. కాని, ఉద్యోగ ధర్మంలో భాగంగా తన బంధుమిత్రులకు మాత్రమే సహాయం చేయడం అవినీతి. తన ధర్మాన్ని తాను కచ్చితంగా పాటించడం నీతి. అందరిపట్ల సమదృష్టితో ఉండడం సామాజిక నీతి. ఒకే భార్య/భర్త కలిగి ఉండడం కుటుంబ నీతి. తనకు చెందని దానిని తాను స్వీకరించకపోవడం నీతి.

నా స్నేహితులైన కొంతమంది విద్యార్థులు (నేను కూడా) పరీక్షలలో సొంతంగా రాస్తారు. ఎవరి సలహాలనూ అడగరు. ఎవరి దానిలో చూసి రాయరు. ఈ విధంగా నైతిక విలువలు పెంచుకోవాలి' అని మా గురువుగారు చాలాసార్లు అంటారు.

3. కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.
ఎదుటి వారిలో తప్పులు వెతకటం కన్నా వారి నుండి మంచిని స్వీకరించటం మేలు అని తెలియజేస్తూ, మిత్రుడికి లేఖ రాయండి.
(లేదా)
పాఠశాలలో జరిగే భాషోత్సవాన్ని తిలకించడానికి ప్రముఖ శతక కవులు వచ్చారు. వారి ద్వారా శతకాల గురించి, వారి రచనల గురించి తెలుసుకోవడానికి పిల్లలు ఇంటర్వ్యూ చేయాలనుకున్నారు. మీరైతే ఏమని ఇంటర్వ్యూ చేస్తారు? ఇంటర్వ్యూకు అవసరమైన ప్రశ్నావళిని రూపొందించండి.

## III. భాషాంశాలు

1. కింది పదాలకు అర్థాలు రాసి వాటితో సొంత వాక్యాలు రాయండి.
ఉదా॥ బుధుడు = పండితుడు
బుధులతో కలిసి ఉండడం వల్ల జ్ఞానం పెరుగుతుంది.
అ) అనయం = ఎల్లప్పుడు
మనం అనయం మంచిమాటలే మాట్లాడాలి. మంచి పనులే చేయాలి.
ఆ) శమం = శాంతి
ప్రజల మధ్య శమం నెలకొన్నప్పుడే, ఐకమత్యం పరిఢవిల్లుతుంది.
ఇ) మైత్రి = స్నేహము
మంచివారి మైత్రి విడిచిపెట్టకూడదు.
ఈ) సౌజన్యం = మంచితనము
మన సౌజన్యము మనకు శ్రీరామ రక్ష.

2. కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి.
అ) విశ్వనాథుడు : విశ్వమునకు ప్రభువు (ఈశ్వరుడు)
ఆ) శివుడు : శుభముతో కూడినవాడు (లేక) శుభములను ఇచ్చువాడు – ఈశ్వరుడు
ఇ) శ్రియఃపతి : శ్రీదేవి యొక్క భర్త – విష్ణువు.

3. కింది పదాలకు పర్యాయ పదాలు రాసి, వాటితో వాక్యాలు రాయండి.
ఉదా॥ గంగ – భాగీరథి, జాహ్నవి
భాగీరథి తీరంలో ఋషులు తపస్సు చేస్తున్నారు. పరమ పావనిగా జాహ్నవి పేరు గాంచింది.
అ) శివుడు – ఈశ్వరుడు, శంకరుడు
భక్తులు ప్రార్థిస్తే ఈశ్వరుడు లోక రక్షణకు విషం త్రాగాడు. అందుకే ఆయన భోళా శంకరుడు.
ఆ) మైత్రి – స్నేహము, చెలిమి
స్నేహమును మించినది లేదు. ఆ చెలిమి కలిమిలేములు చూడదు.
ఇ) కాంత –1) స్త్రీ 2) నారి 3) వనిత
1) ఎన్నికలలో స్త్రీలకు రిజర్వేషన్లు ఇచ్చారు.
2) సీతాదేవి నారీ రత్నము.
3) మా నగరంలో వనితలు వనితామండలి స్థాపించారు.
ఈ) గుడి
ఈ) గుడి – దేవాలయము, కోవెల
శరీరమే దేవాలయం, మనసే కోవెల.

4. కింది వాక్యాలను గమనించండి. ఆయా వాక్యాల్లోని ప్రకృతి వికృతుల్ని గుర్తించి పట్టికగా మార్చండి.
అ) భారతీయ ధర్మం సర్వోత్కృష్టమైంది. బుద్ధుడు దమ్మాన్ని బోధించాడు.
ఆ) ఓ సామి! కుడివైపుగా వెళ్తే స్వామి వారి గుడివస్తుందా?
ఇ) సిరిని కురిపించి లక్ష్మీదేవి శ్రీమంతుల్ని చేస్తుంది.
ఈ) ఆలోచనలు స్థిరంగా ఉండాలి. తిరమైన బుద్ధి వివేకుల లక్షణం.

జ.

| ప్రకృతి | వికృతి |
|---|---|
| అ) ధర్మం | దమ్మం |
| ఆ) స్వామి | సామి |
| ఇ) శ్రీ | సిరి |
| ఈ) స్థిరం | తిరం |

## వ్యాకరణాంశాలు

1. కింది సందర్భాలలో పునరుక్తమయిన హల్లులను పరిశీలించండి. అవి వృత్త్యనుప్రాస అలంకారాలవునో కాదో చర్చించండి.
   అ) నీ కరుణాకటాక్ష వీక్షణములకై నిరీక్షించుచున్నారము.
   ఆ) అడిగెదనని కడువడిఁజను
   నడిగినఁదను మగుడనుడుగడని నడయుడుగున్.
   ఇ) మకరంద బిందు బృంద రసస్యందన మందరమగు మాతృభాషయే.
   ఈ) చూరుకు, తేరుకు, యేరుకు, నారకు, దారువును వాడు నరవరులిలలోన్.

విసర్గసంధి :

2. సంస్కృత పదాల మధ్య విసర్గ మీద తరచు సంధి జరుగుతూంటుంది. అది వేర్వేరు రూపాలుగా ఉండటం గమనిద్దాం. కింది ఉదాహరణలు విడదీసి చూడండి.
   అ) నమోనమః = నమః + నమః - (అః = ఓ)
   ఆ) మనోహరం = మనః + హరం - (అః = ఓ)
   ఇ) పయోనిధి = పయః + నిధి - (అః = ఓ)
   ఈ) వచోనిచయం = వచః + నిచయం - (అః = ఓ)

పై పదాలలో అకారాంత పదాల మీదున్న విసర్గ (అః) లోపించి, అకారం 'ఓ' కారంగా మారింది. కనుక దీనినే సూత్రీకరిస్తే ఇలాగ రాయవచ్చును.

సూత్రం : అకారాంత పదాల విసర్గకు వర్గ ప్రథమ, ద్వితీయాక్షరాలు (క,ఖ,చ,ఛ,ట,ఠ,త,థ,ప,ఫ), శ,ష,సలు గాక మిగిలిన అచ్చులు కాని, హల్లులు కాని పరమైతే విసర్గ లోపించి, 'అ' కారం 'ఓ' కారంగా మారుతుంది.

- పై పదాలను విడదీస్తే - ఈ కింద విధమైన మార్పులు జరిగాయా?
  అ) నమః + నమః
  ఆ) మనః + హరం
  ఇ) పయః + నిధి
  ఈ) వచః + నిచయం
  } అకారాంత పదాల విసర్గకు శ, ష, స లు, వర్గ ప్రథమ, ద్వితీయాక్షరాలు (క, ఖ, చ, ఛ, ట, ఠ, త, థ, ప, ఫ లు) గాక మిగతా అక్షరాలు కలిస్తే - అకారాంత పదాల మీదున్న విసర్గ లోపించి, అకారం 'ఓ'కారంగా మారింది.

- కింది పదాలు కలిపి, మార్పును గమనించండి.
  అ) మనః + శాంతి = మనశ్శాంతి - (విసర్గకు బదులుగా 'శ' కారానికి ద్విత్వం)
  ఆ) చతుః + షష్టి = చతుష్షష్టి - (విసర్గకు బదులుగా 'శ' కారానికి ద్విత్వం)
  ఇ) నభః + సుమం = నభస్సుమం - (విసర్గకు బదులుగా 'స' కారానికి ద్విత్వం)

  పదాలను కలుపగా వరుసగా మనశ్శాంతి, చతుష్షష్టి, నభస్సుమం అనే రూపాలు ఏర్పడ్డాయి కదా! (విసర్గమీద శ, ష, స లు ద్విత్వాలుగా మారడం గమనించండి.)

- కింది పదాలను విడదీయండి.
  అ) ప్రాతఃకాలము - ప్రాతః + కాలము = ప్రాతఃకాలము - (మార్పు లేదు)
  ఆ) తపఃఫలము - తపః + ఫలము = తపఃఫలము - (మర్పు లేదు)

  'స' కారం (స్) విసర్గరూపంగా ప్రయోగింపబడుతుంది. అందుకే నమస్కారము, శ్రేయస్కరము, వనస్పతి మొదలగు సందర్భాల్లో మార్పులేదు.

- కింది పదాలను కలిపి, మార్పును గమనించండి.
  ఉదా॥ అంతః + ఆత్మ = అంతరాత్మ
  అ) దుః + అభిమానం = దురభిమానం
  ఆ) చతుః + దశలు = చతుర్దశలు
  ఇ) ఆశీః + వాదము = ఆశీర్వాదము
  ఈ) పునః ఆగమనం = పునరాగమనం
  ఉ) అంతః మథనం = అంతర్మథనం
  } అంతః, దుః, చతుః, ఆశీః, పునః మొదలైన పదాలకు వర్గ ప్రథమ, ద్వితీయాక్షరాలు. శ,ష, సలు గాక మిగతా అక్షరాలు కలిస్తే విసర్గ రేఫ (ర్)గా మారడం గమనించండి.

- కింది పదాలు విడదీయండి.
  ఉదా॥ ధనుష్కోటి = ధనుః + కోటి (ధనుస్ + కోటి)
  అ) నిష్ఫలము = నిః + ఫలము (నిస్ + ఫలము)
  ఆ) దుష్కరము = దుః + కరము (దస్ + కరము)
  } ఇస్, (ఇః), ఉస్ (ఉః)ల విసర్గకు క, ఖ, ప, ఫ లు పరమైనప్పుడు విసర్గ (స్) 'ష' కారంగా మారుతుంది.

- కింది పదాలు విడదీయండి.
  ఉదా॥ నిస్తేజము = నిః + తేజము
  అ) దుశ్చేష్టితము = దుః + చేష్టితము
  ఆ) ధనుష్టంకారము = ధనుః + టంకారము
  ఇ) మనస్తాపము = మనః + తాపము
  } విసర్గకు చ, ఛ లు పరమైతే 'శ' ట, ఠ లు పరమైతే 'ష' త, థ లు పరమైతే 'స' వస్తుంది.



www.sakshieducation.com

పై ఉదాహరణలన్నీ పరిశీలించిన మీదట విసర్గ సంధి ఆరు విధాలుగ ఏర్పడుతున్నదని తెలుస్తున్నది.

అ) అకారాంత పదాల విసర్గకు వర్గ ప్రథమ ద్వితీయాక్షరాలు (క,చ,ట,త,ప; ఖ,ఛ,ఠ,థ,ఫ), శ,ష,స లు గాక మిగతా అక్షరాలు పరమైనప్పుడు విసర్గలోపించి 'అ'కారం 'ఓ'కారంగా మారుతుంది.

ఆ) విసర్గకు శ,ష,సలు పరమైనప్పుడు శ, ష, సలు ద్విత్వాలుగా మారుతాయి.

ఇ) విసర్గమీద క, ఖ, ప, ఫ లు వస్తే, మార్పురాదు (సంధి ఏర్పడదు).

ఈ) అంతః, దుః, చతుః, ఆశీః, పునః మొదలైన పదాల విసర్గ రేఫ(ర్)గా మారుతుంది.

ఉ) ఇస్, ఉస్‌ల విసర్గకు క, ఖ; ప, ఫ లు పరమైతే విసర్గ 'ష' కారంగా మారుతుంది.

ఊ) విసర్గకు, చ, ఛ లు పరమైతే 'శ' కారం; ట, ఠ లు పరమైతే 'ష' కారం; త, థ లు పరమైతే 'స' కారం వస్తాయి.

## భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టు పని

పాఠశాల గ్రంథాలయంలో శతక పద్యాలున్న పుస్తకాలు తీసుకొని చదవండి. వాటిలో ఏవైనా ఐదు శతక పద్యాలను వాటి భావాలను రాసి ప్రదర్శించండి.

### సంధులు :

1) సవర్ణదీర్ఘసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) భల్లూకాకృతి | = | భల్లూక | + | ఆకృతి | - | సవర్ణదీర్ఘసంధి |
| 2) అఖిలాండపతి | = | అఖిల | + | అండపతి | - | సవర్ణదీర్ఘసంధి |
| 3) జనానురంజన | = | జన | + | అనురంజన | - | సవర్ణదీర్ఘసంధి |
| 4) పాదానతి | = | పాద | + | ఆనతి | - | సవర్ణదీర్ఘసంధి |
| 5) దేహాత్మలన్ | = | దేహ | + | ఆత్మలన్ | - | సవర్ణదీర్ఘసంధి |
| 6) ఇతిహాసామృతము | = | ఇతిహాస | + | అమృతము | - | సవర్ణదీర్ఘసంధి |
| 7) మహావేశము | = | మహా | + | ఆవేశము | - | సవర్ణదీర్ఘసంధి |
| 8) భావనావహము | = | భావనా | + | ఆవహము | - | సవర్ణదీర్ఘసంధి |

2) గుణసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) రామేశ్వరా | = | రామ | + | ఈశ్వరా | - | గుణసంధి |
| 2) విశ్వనాథేశ్వరా | = | విశ్వనాథ | + | ఈశ్వరా | - | గుణసంధి |
| 3) సత్యోక్తి | = | సత్య | + | ఉక్తి | - | గుణసంధి |

3) యణాదేశ సంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) అభ్యుదయము | = | అభి | + | ఉదయము | - | యణాదేశసంధి |

4) గసడదవాదేశసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) ఆకృతి దెస | = | ఆకృతి | + | తోప | - | గసడదవాదేశసంధి |
| 2) శాంతి గూర్చని | = | శాంతి | + | కూర్చని | - | గసడదవాదేశసంధి |
| 3) రక్షసేయని | = | రక్ష | + | చేయని | - | గసడదవాదేశసంధి |

5) ఉత్వసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) మేలగునా | = | మేలు | + | అగునా | - | ఉత్వసంధి |
| 2) కీడొనరించు | = | కీడు | + | ఒనరించు | - | ఉత్వసంధి |

6) అత్వసంధి :

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) లేకైన | = | లేక | + | ఐన | - | అత్వసంధి |
| 2) ఊరకుండినన్ | = | ఊరక | + | ఉండినన్ | - | అత్వసంధి |

7) విసర్గసంధి

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) శ్రియఃపతి | = | శ్రియః | + | పతి | - | విసర్గసంధి |
| 2) దుశ్చేష్టితము | = | దుః | + | చేష్టితము | - | విసర్గసంధి |
| 3) మనస్తాపము | = | మనః | + | తాపము | - | విసర్గసంధి |

### సమాసాలు :

| | సమాసపదం | | విగ్రహవాక్యం | | సమాసం పేరు |
|---|---|---|---|---|---|
| 1) | భల్లూకాకృతి | - | భల్లూకము యొక్క ఆకృతి | - | షష్ఠీ తత్పురుష సమాసం |
| 2) | శివపూజ | - | శివుని యొక్క పూజ | - | షష్ఠీ తత్పురుష సమాసం |

www.sakshieducation.com

| | | | |
|---|---|---|---|
| 3) | దేహాత్మలు | - దేహము, ఆత్మ | - ద్వంద్వ సమాసం |
| 4) | ఇతిహాసామృతము | - ఇతిహాసము అనే అమృతము | - రూపక సమాసం |
| 5) | సౌఖ్య సంపాదనము | - సౌఖ్యము యొక్క సంపాదనము | - షష్ఠీ తత్పురుష సమాసం |
| 6) | వ్యోమగంగ | - వ్యోమము నందలి గంగ | - సప్తమీ తత్పురుష సమాసం |
| 7) | జపతపములు | - జపమునూ, తపమునూ | - ద్వంద్వ సమాసం |
| 8) | రాగవిద్వేషములు | - రాగమునూ, విద్వేషమునూ | - ద్వంద్వ సమాసం |
| 9) | అన్నవస్త్రములు | - అన్నమునూ, వస్త్రమునూ | - ద్వంద్వ సమాసం |
| 10) | జటావల్లి | - వల్లి వంటి జడ | - ఉపమాన ఉత్తరపద కర్మధారయం |
| 11) | తుచ్ఛసౌఖ్యములు | - తుచ్ఛమైన సౌఖ్యములు | - విశేషణ పూర్వపద కర్మధారయం |
| 12) | మనోహరసౌజన్యము | - మనోహరమైన సౌజన్యము | - విశేషణ పూర్వపద కర్మధారయం |
| 13) | మహావేశము | - గొప్ప ఆవేశము | - విశేషణ పూర్వపద కర్మధారయం |

## ప్రకృతి-వికృతులు

| | ప్రకృతి | - | వికృతి | | ప్రకృతి | - | వికృతి |
|---|---|---|---|---|---|---|---|
| 1) | శ్రీ | - | సిరి | 12) | ద్వేషము | - | దేసము |
| 2) | భుజము | - | బుజము | 13) | కవి | - | కయి |
| 3) | వస్త్రము | - | పాంత | 14) | వ్రతము | - | బతము |
| 4) | వాదనము | - | వాదు | 15) | దీపము | - | దివ్వె, దివ్వియ |
| 5) | లక్ష్మి | - | లచ్చి | 16) | ధర్మము | - | దరుమము, దమ్మము |
| 6) | కులము | - | కొలము | 17) | జట | - | జడ |
| 7) | భేదము | - | బద్ద | 18) | తపము | - | తబము |
| 8) | కథ | - | కత | 19) | మర్యాద | - | మరియాద |
| 9) | దోషము | - | దోసము | 20) | స్వామి | - | సామి |
| 10) | గుణము | - | గొనము | 21) | భక్తి | - | బత్తి |
| 11) | శక్తి | - | సత్తి | | | | |

## నానార్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) | కులము | : | 1) వంశము | 2) జాతి | 3) ఇల్లు |
| 2) | గురువు | : | 1) ఉపాధ్యాయుడు | 2) తండ్రి | 3) పురోహితుడు |
| 3) | గంగ | : | 1) భాగీరథి | 2) నది | 3) నీరు |
| 4) | కాంత | : | 1) స్త్రీ | 2) భార్య | 3) ప్రేంకణము |
| 5) | గునము | : | 1) స్వభావము | 2) దారము | 3) అల్లెత్రాడు |
| 6) | కీడు | : | 1) అపకారము | 2) పాపము | 3) చెడు పని |
| 7) | ధర్మము | : | 1) న్యాయము | 2) పుణ్యము | 3) ఆచారము |
| 8) | దోషము | : | 1) తప్పు | 2) దూషణము | 3) పాపము |
| 9) | లక్ష్మి | : | 1)లక్ష్మీదేవి | 2) కాంతి | 3) సంపద |
| 10) | బుద్ధి | : | 1) మతి | 2) తెలివి | 3) మనస్సు |
| 11) | బుధుడు | : | 1) పండితుడు | 2) దేవత | 3) బుధ గ్రహము |

## పర్యాయ పదాలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) | భల్లూకము | : | 1) ఎలుగు | 2) ఎలుగు గొడ్డు | 3) భల్లము | |
| 2) | లక్ష్మి | : | 1) శ్రీ | 2) ఇందిర | 3) కమల | |
| 3) | పయోనిధి | : | 1) అబ్ధి | 2) సాగరము | 3) సముద్రము | |
| 4) | ధనము | : | 1) ద్రవ్యము | 2) అర్థము | 3) విత్తము | |
| 5) | కాంత | : | 1) అంగన | 2) స్త్రీ | 3) పడతి | 4) నారి |
| 6) | మానసము | : | 1) మనస్సు | 2) చిత్తము | 3) మనసు | |
| 7) | ఇల్లాలు | : | 1) భార్య | 2) అర్ధాంగి | 3) పత్ని | |

## వ్యుత్పత్త్యర్థాలు

| | | | |
|---|---|---|---|
| 1) | బుధుడు | : | అన్నింటిని ఎఱిగినవాడు (పండితుడు) |
| 2) | ఈశ్వరుడు | : | ఐశ్వర్యము గలవాడు (శివుడు) |
| 3) | పయోనిధి | : | ఉదకములను ధరించునది (సముద్రము) |
| 4) | విశ్వనాథుడు | : | ప్రపంచమునకు భర్త (శివుడు) |

* * *

www.sakshieducation.com